www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 13 | జూలై | 2026
పేజీలు : 8


## 95 కేజీల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
ఈగల్ టీమ్, విఎం బంజర పోలీసుల ఆధ్వర్యంలో దాడి

2లో

# ఖరీఫ్‌కు.. ఎల్‌నినో దెబ్బ..!



-వేసవిని తలపిస్తున్న ఎండలు

-వట్టిపోతున్న జలవనరులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ రంగంపై ఈ ఏడాది ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎండలు వేసవిని తలపించడంతో పాటు ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. జులై మాసం సగం పూర్తి కావస్తున్నా ఇంత వరకు సరైన వర్షం కురవలేదు. జూన్ మాసం చివరి వారం నుంచి దాదాపు 10 రోజుల పాటు ఆకాశం మేఘావృతమై రైతుల్లో ఆశలు రేపింది. అప్పుడప్పుడు నాలుగు చినుకులు రాలాయి తప్ప పెద్ద వర్షం కురవలేదు. ఆ నాలుగు చినుకులకే మెట్ట పంటలు ప్రధానంగా పత్తి, అపరాల పంటలు సాగు చేశారు. వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, భూమిలో పదును లేకపోవడంతో మొక్కలు విలవిలలాడుతున్నాయి. రైతులు నీటివసతి గల భూముల్లో పంటలను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నీటివసతి లేని భూముల్లో పంటలు సాగు చేసిన రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

**వట్టిపోయిన జలవనరులు :**

వర్షం కాలం సగం ముగిసిన సరైన వర్షం కురవకపోవడంతో జలవనరులు వట్టిపోతున్నాయి. నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలలో కొద్ది కొద్దిగా నీరు కనపడుతుంది తప్ప మిగిలిన ప్రాంతాల్లో జలవనరులు ఎండిన బీళ్లను తలపిస్తున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులలో కూడా నీరు లేదు. రెండు రోజుల నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా మధ్యతరహా ప్రాజెక్టులోకి గోదావరి నీరు చేరుతుంది. ఎన్ని రోజులకు

మిగతా 2లో..

### అంగన్‌వాడీల హక్కుల సాధనకు
## పోరాటాలే శరణ్యం




- అంగన్వాడీలను కట్టుబానిసలుగా చూస్తున్న ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- అంగన్వాడీల పాదయాత్రను ప్రారంభించిన పాషా, మేయర్
- మన్యం వీరుల విగ్రహాలకు పూల మాలలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** అంగన్వాడీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలే శరణ్యమని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో బ్రతుకు భారం ఈడుస్తున్న అంగన్వాడీలకు మోయలేని పనిభారం పడుతోందని ప్రభుత్వం వారిని కట్టు బానిసలుగా చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏఐటియూసి అనుబంధ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను పాషా ఆదివారం భద్రాచలంలో

మిగతా 2లో..

### అభివృద్ధి మరిచి..
## వివాదాల వైపు మళ్లిన కాంగ్రెస్ పాలన




-రిటైర్డ్ ఇంజనీర్ల నివేదికను చూసైనా సోయి తెచ్చుకో రేవంత్‌రెడ్డి
-అశ్వాపురం బీఆర్‌ఎస్ కార్యాలయం వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడ్డ పువ్వాడ, రేగా

**ప్రజాపక్షం/అశ్వాపురం :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పూర్తిగా విస్మరించి దిశాహీన పాలన సాగిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి కంటే వివాదాల వైపు నడిపిస్తోందని మాజీ మంత్రి పువ్వాల అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అశ్వాపురంలో నూతనంగా ప్రారంభమైన బీఆర్‌ఎస్ మండల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావుతో కలిసి ఆయన ప్రభుత్వ విధానాలపై ఘాటు వ్యాఖ్యలు

మిగతా 2లో..

# ఖరీఫ్‌కు ఎల్‌నినో దెబ్బ..!

**(మొదటి పేజీ తరువాయి)**
వైరా చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుతుందో స్పష్టత లేదు. వైరా, పాలేరు, లంకా సాగర్ మొదలైన మధ్యతరహా ప్రాజెక్టులను మినహాయిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రాజెక్టులోనూ నీరు లేదు. వర్షాలు లేకపోవడంతో సాగునీటిని అందించడం సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జీవనది లాంటి మున్నేరుకు ఇంత వరకు కొత్త నీరు రాకపోవడంతో నీటి కదలిక లేదు. వైరా, కిన్నెరసాని, కట్టలేరు, పెద్దవాగు, ముక మామిడి మొదలైన ప్రాజెక్టుల క్రింద ఉన్న లక్షలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

**శాపమైన జాప్యం...**

సాగునీట ప్రాజెక్టుల పట్ల పాలకుల నిర్లక్ష్యం రైతాంగానికి శాపంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పంటల భూములకు సాగునీటిని అందించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు కానీ ఎకరానికి కూడా నీటిని అందించ లేదు. ప్రతి ఏడాది సుమారు 750 టిఎంసిల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి నీటిని పొలాలకు మళ్లించాలన్న సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2004లో జలయజ్ఞం ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసేందుకు రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్‌ల పేరుతో రెండు ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2,100 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్ మరణం, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత 2016లో సీతారామ ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2019 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు బిఆర్ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసింది. ప్రధాన కాలువల్లో అధిక భాగం పంపు హౌజ్‌లు పూర్తి చేశారు. కాంగ్రెస్ సీతారామను కాదనకపోయినా సరిపడ నిధులు కేటాయించకపోవడంతో అంచనాలు పెరిగి ఎప్పటికీ పూర్తవుతుందో చెప్పలేని స్థితి. ఎల్‌నినోలో కూడా గోదావరికి కొత్త నీరు చేరుతుందన్న సందర్భంలో ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండేది కాదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యమే ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం పాలిట శాపంగా మారి ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఏది ప్రత్యామ్నాయం...**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఏ పంటకు ఏది ప్రత్యామ్నాయం అన్నది మాత్రం తేల్చడం లేదు. పామాయిల్ లాంటి ఉద్యానవన పంటలు మినహాయిస్తే మరో సూచన చేయడం లేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు ఇస్తే మంచిది. కానీ రైతులు ఎప్పటిలాగానే పత్తి, అపరాలు, మిర్చి, కొన్ని చోట్ల మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇంతకు మించి ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆగస్టు మాసంలోనే తాగునీటి కొరత కూడా వచ్చే ప్రమాదం పొంచి ఉంది.

# అంగన్‌వాడీల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం










**(మొదటి పేజీ తరువాయి)** కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్యంవీరుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం ఏఐటియూసి అరుణపతాకాలు చేతబూని అంగన్వాడీలు, ఏఐటియూసి నాయకులు కదం తొక్కారు. ఎర్రజెండాలతో భద్రాచలం పట్టణంతో పాటు పాదయాత్ర సాగిన దారులు అరుణ వర్ణమయ్యాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో రెడ్డి అరుణ, గోనె మణి అధ్యక్షతన జరిగిన సభలో పాషా మాట్లాడుతూ అంగన్వాడీల సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారిపై అదనపు విధులు మోపడం వెట్టి చాకిరీ చేయించడమే అన్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు అధిక పనిభారంతో అంగన్వాడీల జీవితాలను ప్రభుత్వం దుర్భరంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని, ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు గుర్తు చేస్తూనే ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమండ్లను తక్షణమే పరిష్కరించి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేదే లేదని పాషా హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటానికి సిపిఐ, ఏఐటియూసి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. హక్కులు సాధించే వరకు ఉద్యమ జెండా దించేదే లేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే వేలాది మంది అంగన్వాడీలతో సచివాలయాన్ని ముట్టడించి తమ సత్తా చాటుతామని పాషా హెచ్చరించారు. ఐసిడిఎస్‌కు సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించాలని, నెలకు రూ.18వేల వేతన హామీని నిలుపుకోవాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బిఎల్ఓ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని, పదవీ విరమణ పొందిన వారి బకాయిలు చెల్లించాలని కోరారు. పాదయాత్రకు దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. వివిధ ప్రాంతాల్లో కార్మికులు,ప్రజలు సంఘీభావం ప్రకటించారు. అరుణపతాకాలు, నినాదాలతో భద్రాచలం వీధులు మార్మోగాయి. అంగన్వాడీల ఐఖ్యతా పోరాట స్ఫూర్తితో పాదయాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు రోజుల పాటు సాగే పాదయాత్ర తొలిరోజు భద్రాచలం మీదుగా సారపాక, బూర్గంపాడు మండలాలతో పాటు పాల్వంచ మండలంలోని జగన్నాథపురం వరకు సాగింది. సారపాకలో ఐటిసి కార్మిక సంఘాల నాయకులు హరిప్రసాద్, పోటు రంగారావు, నాగభూషణం తదితరులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. రెండో రోజు పాదయాత్ర సోమవారం జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయం నుండి మొదలై పాల్వంచ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుంటుంది. కలెక్టరేట్ ముందు సమస్యల పరిష్కారం కోరుతు ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి కార్యదర్శి నందూరి కరుణ కుమారి రాష్ట్ర డిప్యుటి సెక్రెటరి సీతా మహాలక్ష్మి ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శులు శింగు నర్సింహారావు నరాటి ప్రసాద్ సిపిఐ ఏఐటియూసి మహిళా, సమాఖ్యసమాఖ్య నాయకులు కల్లూరి వెంకటేశ్వర్రావు కంచర్ల జమలయ్య సరెడ్డి పుల్లారెడ్డి మువ్వా వెంకటేశ్వరావు మున్నా లక్ష్మి కుమారి వేల్పుల మల్లిఖార్జున్ అన్నారపు వెంకటేశ్వర్లు మీసాల భాస్కర్ రావు ఏపూరి వెంకటేశ్వరరావు ఎస్వీఎస్ నాయుడు మారెడ్డి శివాజీ కంభంమెట్టు శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, రామిరెడ్డి అశోక్ సత్తినేడు సాయిరామ్ రుద్ర బ్రదర్స్ చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# 95 కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఒరిస్సా నుండి మైసూరు తరలిస్తున్న అక్రమ గంజాయి రవాణాను ఈగల్ టీం వియం బంజర్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ముత్తగూడెం లోని గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ పాయింట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 95 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా నుండి మైసూర్ కు కారులో తరలిస్తున్న 95 కేజీల గంజాయి రవాణా చేస్తున్నారు. గ్రీన్ ఫీల్ హైవే ముత్తగూడెం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమాస్పదంగా వ్యవహారిస్తుండగా ఇండికా కారును తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి ని గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం కు చెందిన ఆకుల అయ్యప్ప రెడ్డి, కాకినాడకు చెందిన మొగిలి శెట్టి దేవి, మైసూర్ కు చెందిన అంబరీ పూజారి చంద్రశేఖర్ అనే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని కారును స్వాధీన పరుచుకున్నారు. వివిఎం బంజర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యస్ ఐ వెంకటేష్, ఏ యస్ ఐ చెన్నారావు, సిబ్బంది ఈ దాడి లో పాల్గొన్నారు.

# టిజీవో అధ్యక్షున్ని కలిసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టిజీవో రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావును నూతనంగా ఏర్పాటైన ఖమ్మం జిల్లా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి ప్రతినిధులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏలూరి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. పలు కీలక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో పని చేస్తున్న వేలాది మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన ఏజెన్సీలో భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వం గుర్తించిన చర్యలు తీసుకోకుండా ఏజెన్సీల కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారని ఆ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగుల జీతాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చూడాలన్నారు. ప్రసూతి సెలవులపై వెళ్లే మహిళా ఉద్యోగులకు జీతం లేకుండా సెలవులు మంజూరు చేస్తూ వారి స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఒకేవిధమైన పనులు చేస్తున్న ఉద్యోగులకు వివిధ శాఖల్లో, ప్రాంతాల్లో భిన్నమైన వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. నూతన ఆరోగ్య పథకంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా చేర్చాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏలూరి శ్రీనివాసరావును కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోనగిరి రవికిరణ్, రాష్ట్ర నాయకులు కె. చంద్రశేఖర్‌రావు, ఖమ్మంజిల్లా జేఏసి అధ్యక్షులు పేరాల నరేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి వేల్పుల సుధాకర్, కోశాధికారి అర్వపల్లి నాగేంద్రప్రసాద్, వివిధ శాఖలకు చెందిన నాయకులు సకినాల వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల ఉపేందర్‌రావు, కందుల వెంకటేశ్వర్లు, సుమంత్, శంషీర్, బుచ్చిబాబు, రాజా, గోపాలకృష్ణ, సునీల్, కూశమీరా, బానోత్ రవి, రామకృష్ణ, చంద్రశేఖర్, మోసిన్, హాతిబ్, రంగారావు, విజయరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

# అభివృద్ధి మరిచి వివాదాల వైపు మళ్లిన కాంగ్రెస్ పాలన

**(మొదటి పేజీ తరువాయి)** చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని పువ్వాడ అన్నారు. రైతుల నీటి కోసం ప్రశ్నిస్తే రక్తం పారిస్తాం అనే తరహా వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి భాషను తెలంగాణ ప్రజలలు ఎన్నడూ చూడలేదని మండిపడ్డారు. రైతులకు నీళ్లు అందించడానికి మా రక్తమే అడ్డమైతే..ఆ రక్తాన్ని ఇవ్వడానికి కూడా సిద్ధమే. కానీ రైతుల హక్కులను కాలరాయనివ్వం అని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం కావాలనే అపోహలు సృష్టిస్తోందని పువ్వాడ ఆరోపించారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సమర్పించిన నివేదిక ప్రకారం మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని చెప్పినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద సరిపడా నీటి మట్టం ఉన్నప్పటికీ, రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసి గోదావరి బేసిన్‌లోని రిజర్వాయర్లను నింపే అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వదులుకుంటోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందితే అది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విజయంగా నిలుస్తుందనే ఉద్దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని పువ్వాడ ఆరోపించారు. భద్రాచలం ముంపుకు కాళేశ్వరం కారణమనే ప్రచారం పూర్తిగా అసత్యమని, పోలవరం ప్రాజెక్టు ప్రభావమే భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారుతుందని అన్నారు. ఎ సింగరేణి సంస్థలో ఉద్యోగులు, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన పువ్వాడ, పే రివిజన్, ఉద్యోగ నియామకాలు, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని ప్రకటించారు. సింగరేణిని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, కార్మికుల హక్కుల కోసం పార్టీ రాజీపడదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్, బీటీపీఎస్ విస్తరణ, పినపాక నియోజకవర్గ అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందుకు సాగడం లేదని పువ్వాడ విమర్శించారు. జిల్లా నీటిని ఇతర ప్రాంతాలకు తరలించడంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, స్థానిక చెరువులు నింపడంలో కనిపించడం లేదని అన్నారు.

**దివంగత సువర్ణలతకు నివాళి...**

విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు తదితరులు అశ్వాపురంలోని తుళ్లూరి ఫంక్షన్ హాల్‌కు వెళ్లి దివంగత యార్లగడ్డ సువర్ణలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు , సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు చేయూతనందించడమే ట్రస్ట్ లక్ష్యం

**-ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతిభ గల విద్యార్థుల విద్యాభ్యాస్యానికి చేయూతనివ్వడమే పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య తెలిపారు. విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ట్రస్ట్ కృషి చేస్తుందని పుల్లయ్య తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన ఆకుల నూహిత సాయి బియస్సి నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతుంది. నూహిత సాయి తల్లి అనురాధ ఇండ్లలో పనిచేసుకుంటూ కుమార్తెను చదివిస్తుంది. ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక సహాయం అందించాలని ట్రస్ట్‌ను సంప్రదించినట్లు పుల్లయ్య తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఆకుల నూహిత సాయి విద్యాభ్యాస్యం కోసం రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో కుంచకూరి సతీష్, ఝాన్సీ దంపతుల సౌజన్యంతో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థుల విద్యాభ్యాసం పేదరికంతో ఆగిపోకుండా ఉండేందుకు ట్రస్ట్ సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని తెలిపారు. సహయం పొందిన వారు భవిష్యత్తులో తమ వంతుగా ఇతరులకు సహయ సహకరాలను అందించాలని కోరారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కుంచకూరి సతీష్, ఝాన్సీ కుమారి, పోష్య సాయి, విశ్రాంత ఉపాధ్యాయులు అబ్దుల్ షరీఫ్, విద్యార్థిని తల్లి అనురాధ పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్‌కు 550 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల

**-సాగర్ కాల్వ ఎస్కేప్ లాకులు ఎత్తి నీటి ప్రవాహానికి -శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**
**-రెండు పంటలకు సాగునీరు అందుతుంది**
**-ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ ఎస్కేప్ లాకులను ఎత్తి వైరా రిజర్వాయర్‌కు 550 క్యూసెక్కుల గోదావరి జలాలను ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం జిల్లా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ రైతులకు ప్రతి ఏడాది సాగునీటి సమస్య తలెత్తుతుండటంతో సకాలంలో నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.100కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టు పరిధిలో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. గోదావరి జలాలను సాగర్ కాల్వలోకి తరలించి అక్కడి నుంచి అనుసంధాన వాగుల ద్వారా వైరా రిజర్వాయర్‌కు చేరవేస్తున్నట్లు తెలిపారు. దీంతో వైరా ఆయకట్టు రైతుకలు సంవృద్ధిగా సాగునీరు అందడంతో రెండు పంటలు సాగు చేసే అవకాశం కలుగుతుందని, భవిష్యత్తులో సాగునీటి కొరత సమస్య ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చ్యలు చేపట్టిందనానరు. గోదావరి జలాల తరలింపుతో వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. గోదావరి జలాల విడుదల సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారావు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, ఫణితి సైదులు, వుండ్రు శ్యామ్‌బాబు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, తేలూరి వీరయ్య, తాతా నిర్మల, ఫణితి శ్రీను, ఐవి నాగేశ్వరరావు, వేముల రత్నాకర్, తోటకూర శ్రీకాంత్, ధర్మారావు, ప్రతిభా భారతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 15న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగుల మహా ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో సిపిఎం డివిజన్ కార్యాలయం బోడేపూడి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉన్నత విద్య పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారిన, ఖాళీ పోస్టుల భర్తీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న అన్ని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించి వెంటనే నియామక ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం జులై15న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో ఇందిరాపార్క్, ధర్నా చౌక్ వద్ద నిర్వహించే నిరుద్యోగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వైరా డివిజన్‌కు చెందిన నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మహా ధర్నా పోస్టర్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, మాగంటి తిరుమలరావు, బాజోజి రమణ, షేక్ మజీద్, చిత్తారు నాగరాజు, ద్రోణాదుల నాగేశ్వరరావు, శీలం వెంకటరెడ్డి, బాణాల వెంకట్రావమ్మ, శరబంది తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన ఎం.రేణుతేజస్వినికి గ్రామ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎం.రాంప్రదీప్, జి.హనుమంతరావుల ఆధ్వర్యంలో ఆర్థిక సహయాన్ని ఆదివారం అందించారు. రేణుతేజస్విని తన తండ్రిని కోల్పోయిన బాధను సైతం దిగమింగుకుని ఇంటర్మీడియేట్‌లో ప్రతిభ కనబర్చి 989 మార్కులు పొందటమే కాకుండా ఇంజనీరింగ్ ప్రవేశ్ర పరీక్షలో 4900 ర్యాంకు సాధించిన విషయాన్ని తెలుసుకున్న గుంటుపల్లి గోపవరం పాఠశాల పూర్వ విద్యార్థులు సంఘ ప్రతినిధులు ఎం.రాంప్రదీప్, జి.హనమంతరావులు పాఠశాల పూర్వ విద్యార్థుల సౌజన్యంతో రూ.15వేలు ఆదివారం తిరువూరులో జరిగిన కార్యక్రమంలో అందచేశారు. అదే విధంగా ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరానికి హాస్టల్ ఖర్చులని పూర్వ విద్యార్థుల సంఘం తరుపున భరిస్తామని రేణుతేజస్వినికి హామీ ఇచ్చారు. తనకు ఆర్థిక సహాయం అందించిన గ్రామ పూర్వ విద్యార్థి సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది. వారు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి గ్రామానికి పేరు తెస్తానని అన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రివర్యులు మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.10లక్షలు విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర పట్టణానికి చెందిన లబ్దిదారులకు మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలుపుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ప్రతి అర్హుడికి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేలా నిరంతరం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్దిదారులు తమకు ఆర్థిక సహాయం అందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి హృదయపూర్వ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, బాణావత్ వెంకటరమణ నాయక్, బెజ్జం రాజు, ధార నాగార్జున, బొల్లెద్దు విజయకుమారి, డివిజన్ కమిటీ అధ్యక్షులు షేక్ జహంగీర్, సామినేని రామనాధం, నకిరికంటి గోవింద్, కోట డేవిడ్, మోదుగు బాబు, షేక్ రబ్బాని, షేక్ గౌసుద్దీన్, సజ్జా ప్రసాద్ తదితర కాంగ్రేస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌లో కేజ్ వీల్స్‌తో రోడ్లపై ప్రయాణించవద్దు



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ :** ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు పనులు జరుగుతున్న నేపద్యంలో రైతు సోదరులకు మధిర రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ డి.మధు ముఖ్య విజ్ఞప్తి చేశారు. వరి పొలాల్లో దమ్ము పనులకు ఉపయోగించే ట్రాక్టర్లకు అమర్చే కేజి వీల్స్‌తో గ్రామీణ రహదారులు, ప్రధాన రహదారులపై ప్రయాణించడం వలన రహదారులు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. దీనివలన ప్రభుత్వ ప్రజా ఆస్తికి నష్టం కలగడమే కాకుండా ఇతర వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అందువలన రైతులు ఒక పొలం నుంచి మరో పొలానికి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే సమయంలో కేజీ వీల్స్‌ను రహదారులపై నడపకుండా వాటిని ఎత్తుకొని తగిన వాహనంలో తరలించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి కేజీ వీల్స్‌తో రహదారులపై ప్రయాణించి రహదారులను దెబ్బతీసే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ డి.మధు హెచ్చరించారు. రైతు సోదరులందరూ పోలీస్‌శాఖకు సహకరించి ప్రజా ఆస్తులను పరిరక్షించాలని, రహదారులను సురక్షితంగా ఉంచాలని డి.మధు కోరారు.

# ప్రీ ప్రైమరీ టీచర్స్, ఆయాలకు నియామకం



**ప్రజాపక్షం/వైరా:** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి వైరా మండలంలో ప్రీ ప్రైమరీ సెక్షన్స్ శాంక్షన్ అయిన ఐదు పాఠశాలలు ఎంపిపిఎస్ పాలడుగు, ఎంపిపిఎస్ రెబ్బవరం, ఎంపిపిఎస్ వైరా, ఎంపిపిఎస్ (సిపిఎస్) వైరా, ఎంపియుపిఎస్ ఖానాపురంలకు సం బంధించి ప్రీ ప్రైమరీ టీచర్స్, ఆయాలకు జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా అందిన నియామక ఉత్తర్వులు ఆదివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి అందించబడ్డాయి. వారు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. సోమవారం ఉదయం 9గంటలకు వారి వారి పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్స్, ఆయాలు విధుల్లో చేరుతున్నారని మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో తీసుకున్నారని టీచర్లకు నెలకు రూ.8వేలు, ఆయాలకు రూ.6వేలు అందిస్తారని ప్రీ ప్రైమరీ సెక్షన్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉన్నప్పుడు మాత్రమే సెక్షన్‌లు కొనసాగుతాయని తెలిపారు.

# బిఆర్ఎస్ కార్యకర్తకు అండగా నిలిచిన నాయకులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ రెండో వార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బిఆర్ఎస్ కార్యకర్తల బత్తుల లింగారావును ఆదివారం బిఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు పరామర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి 50 కేజీల బియ్యంతో పాటు నిత్యవసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన లింగారావు ధైర్యంగా ఉండాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని, ఎలాంటి అవసరం వచ్చినా పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అధైర్యపడకుండా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, తిరుపతి శ్రీను, ఆదూరి ప్రేమ్‌కుమార్, కారుకొండ బోసు, మాదినేని లక్ష్మ ణ్, ఫణితి శాంతయ్య, యంద్రాతి గోపాలరావు, మాచర్ల శంకర్, వేముల శివ, దేవళ్ళ శ్రీను, పల్లపు రాంబాబు, వెంకన్నతో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో ఉచిత రక్త పరీక్షలు శిబిరం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల వెంకటాపురం గ్రామంలో నవశకం ఆధ్వర్యంలో రక్త పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. రక్తపరీక్షల శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవశకం ఫౌండర్ మేకల రమేష్, రాజులపాలెంసొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి, క్రిమిస్ట్ అండ్ డ్రగిస్టు, మండల అధ్యక్షులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సమస్యలపై సీఎంకి తుడుం దెబ్బ వినతి



ప్రజాపక్షం/ఇల్లందు : ఆదివాసీల సమస్యలు, హక్కుల పరిరక్షణపై తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. ఈసందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల రిజర్వేషన్లు, ఏజెన్సీ ప్రాంతాల్లో వలసదారుల సమస్యలు, పోడు భూములకు పట్టాలు, జీవో నెంబర్ 3, 1/70 చట్టం, పీసా చట్టం అమలుపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూకబ్జాలను అరికట్టాలని, ఆదివాసీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. వర్షాకాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కొరతతో గర్భిణీలు ఇబ్బందులు పడుతున్నారని, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడో మహాసభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/సుజాతనగర్‌: తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర మహాసభను ఉద్దేశించి ఆదివారం సుజాతనగర్ మండలం సిపిఐ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం ముఖ్యఅతిథిగా తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల18, 19వ తేదీలలో జరిగే గిరిజన సమైక్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభను పాల్వంచ పట్టణం లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనీ సాంబశివరావు, సీపీఐ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా పాల్గొంటున్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దసరు నాయక్, సుజాతనగర్ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జర్పుల ఉపేందర్, ఎఎంసి డైరెక్టర్ ఓకే నాగేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, రమేష్, బాలు, అనిల్, అతిరం రవి, రాజేష్. తదితరులు పాల్గొన్నారు.

## సీడ్స్, ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షునిగా రాఘవ ఎన్నిక



ప్రజాపక్షం /టేకులపల్లి : సీడ్స్, ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షులుగా నాగినేని రాఘవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ మండల సమావేశం స్థానిక చుక్కాలబోడు రైతువేదికలో ఆదివారం జరిగింది. జిల్లా నాయకుల సమక్షంలో మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల అధ్యక్షులుగా నాగినేని రాఘవ, కార్యదర్శిగా భూక్యా లవకుమార్, ఉపాధ్యక్షులుగా బొప్పాల వెంకట సుబ్బారావు, కోశాధికారిగా గంగారపు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో నూతన అధ్యక్షులు రాఘవ మాట్లాడుతూ, సభ్యులందర్ని కలుపుకుని సంఘం అభివృద్ధికి పాటుపడుతానని, సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాళ్ళ సోమసుందర్, నాయకులు రామలింగయ్య, నాగేశ్వరరావు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల ఎన్నిక



ప్రజాపక్షం/టేకులపల్లి : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ శాఖల నూతన కమిటీలను ఎంపిక నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఆదివారం కుంటల్ల, మద్రాసుతండా గ్రామ శాఖలను నాయకులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కుంటల్ల గ్రామ శాఖ అధ్యక్షులుగా చింత వీరభద్రం, ఉపాధ్యక్షులుగా మోకాళ్ల చిన్న పోశాలు, దనసరి రామస్వామి, ప్రధానకార్యదర్శిగా దనసరి బిక్షమయ్య, కార్యదర్శిగా మోకాళ్ల రాధ, కోశాధికారిగా అల్లెం వీరభద్రం, ప్రచార కార్యదర్శిగా అల్లెం కౌసల్య, కార్యవర్గ సభ్యులుగా ఈసం రాంబాబు, తురస రాంబాబు, శేఖర్, సురేష్, కొనయ్య, రాములు, సోమయ్య, సర్వేష్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా మద్రాసుతండా గ్రామ శాఖ అధ్యక్షులుగా కోళోత్ రాజేష్, ఉపాధ్యక్షులుగా గర్ప నరసింహారావు, బానోతు వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా జర్పుల భద్రం, కార్యదర్శిగా భూక్యా సాములు, కోశాధికారిగా శెట్టిపల్లి నరసింహారావు, ప్రచార కార్యదర్శిగా బానోతు రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా చందర్, సంతోష్, మహేష్, సురేష్, సుక్కో, రమేష్, ఆదినారాయణ, చిన్న సోమ్లా, వీరన్న, సుధీర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాల్లో కుంటల్ల పంచాయితీ సర్పంచ్ మోకాళ్ల రమాదేవి, మద్రాసుతండా పంచాయితీ సర్పంచ్ మాళోతు గంగ్లి, ఉప సర్పంచ్ జర్పుల లింగ, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాయిలర్ కోళ్ల పెంపకం ఆదాయమా? సవాళ్లా..?

**రైతులు తెలుసుకోవాల్సిన నిజాలు**





ప్రజాపక్షం/తల్లాడ: వ్యవసాయానికి అనుబంధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో బ్రాయిలర్ కోళ్ల పెంపకం ఒకటి. తక్కువ కాలంలో అధిక దిగుబడి, మార్కెట్లో నిరంతరం డిమాండ్ కారణంగా అనేక మంది రైతులుయ, యువ పారిశ్రామికవేత్తలు ఈ రంగం వైపు అడుగులు వేస్తున్నారు. అయితే ఈ రంగంలో ఎంతటి అవకాశాలున్నాయో, అంతే స్థాయిలో సవాళ్లు కూడా ఉన్నాయి. సరైన ప్రణాళిక, శాస్త్రీయ నిర్వహణ ఉంటే మంచి లాభాలు పొందవచ్చని పశుసంవర్ధన శాఖ అధికారులు సూచిస్తున్నారు. బ్రాయిలర్ కోళ్లు సాధారణంగా 35 నుంచి 45రోజుల వ్యవధిలోనే మార్కెట్‌కు సిద్ధమవుతాయి. ఈ కారణంగా పెట్టుబడి త్వరగా తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. చిన్నస్థాయిలో ప్రారంభించి అనుభవం పెరిగిన తర్వాత పెద్దస్థాయికి విస్తరించవచ్చు. ప్రస్తుతం చికెన్‌కు మార్కెట్‌లో ఏడాది పొడువునా డిమాండ్ కొనసాగుతోంది. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, ఫంక్షన్‌లు, గృహ వినియోగం వంటి కారణాలతో చికెన్ వినియోగం పెరుగుతోంది. ఈ పరిస్థితి బ్రాయిలర్ రైతులకు అనుకూలంగా మారుతోంది. అయితే కోళ్ల పెంపకంలో ఆహార ఖర్చు మొత్తం వ్యయంలో అత్యధిక భాగం ఆక్రమిస్తుంది. ఫీడ్ ధరలు పెరిగితే రైతుల లాభాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలాగే మార్కెట్‌లో చికెన్ ధరలు ఒక్కసారిగా పడిపోతే నష్టాలు తప్పవు. వర్షాకాలంలో వైరల్, భాక్టీరియా వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. బయోసెక్యూరిటీ చర్యలు పాటించకపోతే భారీ సంఖ్యలో కోళ్లు చనిపోయే ప్రమాదం ఉంది. ఫలితంగా రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుంది. విద్యుత్ సరఫరా అంతరాయం కూడా పెద్ద సమస్యే. చిన్న కోడిపిల్లలకు సరైన ఉష్ణోగ్రత అవసరం. కరెంట్ లేకపోతే మరణాల శాతం పెరిగే అవకాశం ఉంది. అందుకే ప్రత్యాన్మాయ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కోళ్ల షెడ్లలో పరిశుభ్రత లేకపోతే వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. క్రమం తప్పకుండా శుభ్రపరచడం, క్రిమిసంహారక మందులు ఉపయోగించడం, సరైన గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవడం అత్యంత అవసరం. బ్రాయిలర్ కోళ్ల పెంపకంలో విజయానికి నాణ్యమైన పిల్లలు, సమతుల్య ఆహారం, శుభ్రమైన నీరు, సమయానికి టీకాలు, పశువైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

**- బ్రాయిలర్ కోళ్ల పెంపకంతో లాభాలు :**

3545 రోజుల్లోనే అమ్మకానికి సిద్ధమవుతాయి.
తక్కువ సమయంలో పెట్టుబడి తిరిగి వస్తుంది.
మార్కెట్లో చికెన్‌కు నిరంతర డిమాండ్ ఉంటుంది.
ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయికి విస్తరించే అవకాశం ఉంటుంది.
కుటుంబసభ్యులతోనే నిర్వహించవచ్చు.
గ్రామీణ యువతకు మంచి స్వయం ఉపాధి మార్గం.
సరైన నిర్వహణతో మంచి ఆదాయం.

**బ్రాయిలర్ కోళ్ల పెంపకంతో నష్టాలు:**


ఫీడ్ ధరలు పెరగడంతో వ్యయం అధికమవుతుంది.
మార్కెట్ ధరలు తగ్గితే లాభాలు తగ్గిపోతాయి.
వ్యాధులు వస్తే భారీ నష్టం సంభవిస్తుంది.
విద్యుత్ అంతరాయాలు కోళ్లపై ప్రభావం చూపుతాయి.
వాతావరణ మార్పులు ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి.
బయోసెక్యూరిటీ పాటించకపోతే మరణాల శాతం పెరుగుతుంది.
మందులు, టీకాలు ఖర్చు పెరుగుతుంది.

అనుభవం లేకుండా ప్రారంభిస్తే ఆర్థిక నష్టాలు ఎదురయ్యే అవకాశం ఉంది. పశు సంవర్ధన శాఖ అధికారులు రైతులకు శిక్షణ తీసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో కోళ్ల పెంపకం చేపట్టాలని సూచిస్తున్నారు. మార్కెట్ పరిస్థితులను ముందుగానే అంచనావేసి, వ్యయ నియంత్రణపై దృష్టి పెట్టిన రైతులు ఈ రంగంలో మంచి ఫలితాలను సాధించగలరని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రాయిలర్ కోళ్ల పెంపకం లాభదాయకమైన వ్యవసాయ అనుబంధ రంగమే అయినప్పటికీ, సరైన నిర్వహణ, వ్యాధి నివారణ, మార్కెట్ అవగాహన, వ్యయ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపితేనే ఆశించిన ఆదాయం సాధ్యమవుతుంది.

## అంధకారంలో మండల కేంద్రం..!

**-వెలగని సెంట్రల్ లైటింగ్**
**-చిమ్మ చీకటిలో ప్రధాన రహదారిపై ప్రయాణం**
**-పట్టించుకోని అధికారులు, పాలకులు**





ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం నూతన జిల్లాగా ఏర్పడడంతో పాటు కొత్తగూడెం జిల్లా కేంద్రం కావడంతో పరిసర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయి. అయితే రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వంలో రహదారుల విస్తరణ పనులు చేపట్టారు. నాలుగు లైన్ల రహదారి తో పాటు డివైడర్ సెంట్రల్ లైటింగ్ ను కూడా ఏర్పాటు చేశారు. అయితే జూలూరుపాడు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపం నుంచి చంద్రుగొండ వెళ్లే క్రాస్ రోడ్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మారింది. లక్షల ప్రజాధనం వెచ్చించి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగమేఘాలపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. జూలూరుపాడు మండలకేంద్రం. ఖమ్మం, కొత్తగూడెం పట్టణాలకు ప్రధాన రహదారి వెంట జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ఈ నిత్యం ప్రయాణం చేస్తుంటారు కానీ, వెంగన్న పాలెం మేజరు పంచాయతీ ప్రధాన రహదారిలో రాత్రిపూట అడుగు పెడితే నలభై ఏళ్లు వెనక్కి వెళ్లినట్లు అనిపిస్తుంది. ఐదారు రోజుల్నుంచి వెంగన్న పాలెం గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ వెలగక ప్రధాన రహదారి అంధకారంతో రాజ్యమేలుతున్నా అధికారులు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదు. కొత్తవి వేయించడం అట్టుంచితే చిన్నచిన్న మరమ్మతులు చేస్తే వెలిగే లైట్లు కూడా అలానే వదిలేశారు. ప్రధాన రహదారి సైడ్ డ్రైన్లు అక్రమణలకు గురవుతున్నా, సెంట్రల్ లైటింగ్ వెలగక పోయినా, ప్రధాన రహదారి బాగోగులు పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు, పాలకులు..**

జూలూరుపాడు ప్రధాన రహదారిపై చిమ్మ చీకటిలో ప్రయాణాలు సాగించాల్సి వస్తుందని ప్రయాణికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల శాఖ అధికారులు సైతం వీటిని పట్టించుకోవడం లేదు. దీంతో సాయంత్రం 6 గంటలు దాటితే చాలు ఈ రహదారి మొత్తం చిమ్మ చీకటిగా మారుతుంది. ఎవరికివారు పర్సంటేజ్ లు వస్తాయని భావించారో ఏమో తెలియదు కానీ,హడావుడిగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కానీ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోలేదని, ఎవరికి వారు తమకు సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలీస్ స్టేషన్ సమీపం నుంచి చంద్రుగొండ క్రాస్ రోడ్డు వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ప్రజలు కోరుకుంటున్నారు.

## ఆక్రమణదారుల చెరలో వైరా గాంధిచౌక్ మున్సిపల్ భూమి?

**ఆక్రమణలు తొలగించి పార్క్ లేదా వాణిజ్య భవనాలు నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి**








ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధిచౌక్‌లో ఉన్న మున్సిపాలిటీ భూమి ప్రస్తుతం ఆక్రమణదారుల చేతుల్లో బందీగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు గాంధీచౌక్ ప్రాంతంలో సుమారు 100 అడుగుల వెడల్పుతో రహదారి ఉండేదని, అనంతరం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అప్పటి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కాంప్లెక్స్‌ను నిర్మించినట్లు వారు గుర్తు చేస్తున్నారు. అయితే గాంధి విగ్రహం, చుట్టుప్రక్కల ఉన్న విలువైన మున్సిపల్ భూమి క్రమంగా ఆక్రమణలకు గురైందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి భూమిని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలని వారు కోరుతున్నారు. స్వాధీనం చేసుకున్న భూమిలో సుందరమైన పార్క్‌ను ఏర్పాటు చేస్తే ఆ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించవచ్చని లేదా వాణిజ్య భవనాలను నిర్మిస్తే మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అందువలన ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గాంధీచౌక్‌లోని ఆక్రమిత మున్సిపల్ భూమిని తిరిగి స్వాధీనం చేసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## సమితి సింగారం అభివృద్ధికి శ్రీకారం

**రూ.25 లక్షల సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ ఎమ్మెల్యే పాయం**



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ అంబేద్కర్ సెంటర్‌లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు ఆదివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రూ.25 లక్షలతో చేపట్టనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం




ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం సమితి సింగారం లోని ఎస్‌టీ బాయ్స్ హాస్టల్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎస్‌టీ బాయ్స్ హాస్టల్‌లో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు పూర్తయితే విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి విద్యార్థుల ఉపయోగానికి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, నియోజకవర్గంలోని గిరిజన విద్యా సంస్థల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, సంబంధిత శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చిర్రమళ్ళ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ చందా లింగయ్య దొరకు సన్మానం



ప్రజాపక్షం/కరకగూడెం: అమెరికాకు చెందినా ప్రతిష్ఠాత్మక యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ లీడర్షిప్ ఎక్స్ లెన్స్ వారు గౌరవ డాక్టరేట్, మాజీ ఎంఎల్‌ఏ అండ్ మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ చందా లింగయ్య దొర కు ప్రధానం చేసిన సందర్భంగా తన స్వగృహం నందు, చిర్రమల్ల యూత్ ఆధ్వర్యంలో చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5వ షెడ్యూల్ భూభాగం హక్కులపై అలుపెరగని పోరాటాలకు గాను గుర్తించి ఈ డాక్టరేట్ ప్రధానం చేశారన్నారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా 1700 మంది గిరిజనేతరులు సుప్రీం కోర్టులో కేసు వేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పార్టీలకు, సంఘాలకు అతీతం గా ఐదవ షెడ్యూల్డ్ పరిరక్షణకై ఉద్యమం లో ఆదివాసీ సమాజం ఉద్యమంలో భాగం కావాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సీనియర్ నాయకులు చందా రాఘవులు, చిరుమల్ల గ్రామ పెద్దలు చందా బిక్షపతి,చందా గోవర్దన్, గొంది లక్ష్మణ్ రావు, పేరంటాలు పోలెబోయిన రాణి, సరోజిని, సావిత్రి యూత్ ఉమ మహేష్, అశోక్, కృష్ణం రాజు, రామక్రిష్ణ , సత్యం పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎంఎల్‌ఏ



ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన రావులపల్లి నరసింహారావును స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. రావులపల్లి నరసింహారావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్, సహా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక పిలుపునిచ్చింది. ములకపాడు సెంటర్‌లో సోయం కామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళలు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంపై చర్చించారు. ఈసమావేశంలో కొమురం దామోదరరావు, కుంజా శ్రీనివాస్, సోయం కామరాజు, సరియం కోటేశ్వరరావు, తెల్లం హరికృష్ణ, తునికి కామేష్, కుర్సం రవి, పొడియం సుబ్బారావు, కరుణ పాల్గొన్నారు.

## జూలై 13న చలో ఐటీడీఏ ముట్టడిని జయప్రదం చేయండి



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: పోడు భూముల హక్కుల సాధన కోసం జూలై 13న నిర్వహించే ఛలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని సీరిగుండం, గద్దమడుగు గ్రామాల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఛలో ఐటీడీఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమాల్లో మడివి అర్జున్, కొమురం వీరాజు, మడకం రమేష్, నంద, చందు, మడకం నాగేశ్వరరావు, ఇర్మయ్య, జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



ప్రజాపక్షం/కారేపల్లి : దుబ్బతండా గ్రామ పంచాయితీ సర్పంచ్ ఆంగోత్ మత్రు నాయక్ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్య, భోజనం, వసతి, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆటో కార్మిక సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి

**-17న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు**



ప్రజాపక్షం/కూసుమంచి: ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబానికి నెలకు రూ 5వేల ఆర్థిక భృతి, రూ 5లక్షల ఆరోగ్య భీమా కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గుండెపంగు మల్లేష్ డిమాండ్ చేశారు. కూసుమంచి మండలం గైగోళ్లపల్లి ఆటో స్టాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ ఫీజులు, గ్రీన్ ట్యాక్స్, జరిమానాల భారాన్ని తగ్గించాలని కోరారు. ఈనెల 17న ఖమ్మంలోని ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జరిగే తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)8వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సుమన్, రవీందర్, నాగరాజు, శ్రీకాంత్, ప్రసాద్, అనిల్, సురేందర్, మన్సూర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలి




**-ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో ఏఐవైఎఫ్ మండల మహాసభ బానోత్ రవి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనలో పాలకులు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడలేనివిధంగా భారతదేశంలో అత్యధికంగా 60 శాతం యువశక్తి ఉందన్నారు. అటువంటి యువశక్తిని సద్వినియోగం చేసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ సాక్షిగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. కేవలం పోలీస్ శాఖలో తప్ప ఏ శాఖలోనూ నోటిఫికేషన్లు జారీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో కేవలం ఉద్యోగ విరమణలు తప్ప నూతన నియామకాలు జరగడం లేదని ఎద్దేవా చేశారు. యువతను కేవలం ఓటు బ్యాంకు, రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక నిరాశకు లోనై చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. పాలకుల వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, గిరిజన సమాఖ్య జిల్లా సమితి సభ్యులు బానోత్ నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నాదెండ్ల పుల్లయ్య, సీనియర్ నాయకులు బోడా చిన్నా నాయక్, కిరణ్, రావెళ్ల సురేష్, బానోత్ రవి, గుగులోత్ హరి, యువకులు పాల్గొన్నారు.

**ఏఐవైఎఫ్ మండల కమిటీ ఎన్నిక :**

ఏఐవైఎఫ్ రఘునాథపాలెం మండల నూతన కమిటీని 16 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కుంచా గోపిచంద్, అధ్యక్షులుగా గుండ్ల అశోక్, వర్కింగ్ కార్యదర్శిగా బానోత్ పవన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేష్ లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# సీపీఐ ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం, వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ చెక్కులు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా మంజూరయ్యాయి. ఘనపారపు కొమరయ్యకురూ.57వేల ఐదువందలు, బానోత్ అమర్‌కు రూ.60వేలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, సీపీఐ నాయకులు మామిడి సుదర్శన్‌రెడ్డి, వెన్నం భాస్కర్, వెంపటి రాము, ఘనపారపు నాగయ్య, వీరబాబు, కరుణాచారి, యోబు, రాజు, కృపాకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని ముత్తా రం వనం వారి కృష్ణాపురం, కమలాపురంలో'సర్'(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హులైన ఓటర్లు తప్పనిసరిగా పాల్గొని, ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఓటరు సర్ ప్రక్రియలో భాగస్వామ్యులై ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా, సక్రమంగా నింపి నిర్ధేశిత గడువులోగా సమర్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతీ పౌరుడికి కల్పించిన విలువైన హక్కు అని, దానిని పరిరక్షించుకావాల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి వెంకట్ నారాయణ రెడ్డి, కుక్కల రామచంద్రం, కిరణ్, ఎల్.బాబు, కొప్పుల మునయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువతను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ**






**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రపంచదేశాల్లో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో అత్యధికంగా 60 శాతం యువత ఉందని అలాంటి యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆరోపించారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభ మండల పరిదిలోని తనికెళ్లలో యాసా లక్ష్మీ నరసింహారావు(పెద్దబ్బాయి) భవన ప్రాంగణంలో ఆదివారం నరేష్, కరుణాకర్, కౌశిక్ అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు దొండపాటి రమేష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతు పార్లమెంట్ సాక్షిగా ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామినిచ్చి ప్రధాని నరేంద్రమోడి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. తెలంగాణలో గత బిఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీకూడా యువతకు ఇచ్చిన హామీని నిలబెట్లుకోలేదని అన్నారు. కేవలం పోలీస్‌శాఖలో తప్ప మరేశాఖలో కొత్త నియామకాలు జరగలేదని తెలిపారు. నిరుద్యోగులుగా ఉన్న యువత చెడువ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్లకే ఓటుహక్కు కావాలని చంద్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోరాడి యువతకు 18 ఏళ్లకే ఓటుహక్కు సాధించిన ఘనత ఏఐవైఎఫ్ కే దక్కుతుందని స్పష్టంచేశారు. భద్రాచలంలో బీడి ఫ్యాక్టరీ, పాల్వంచలో ఎరువుల కర్మాగారం, బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉంటే యువతకు ఉద్యోగాలు దక్కేయని అన్నారు. అనంతరం ఏఐవైఫ్ మండల అధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా తుప్పతి కౌశిక్, కోశాధికారిగా మాదుగ కిరణ్‌తోపాటు సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, 15 మంది ఆఫీస్ బేరర్స్ తోపాటు 25 కమిటీ సబ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, స్వర్ణ రమేష్, పాపగంటి సుదర్శన్, లేడిబోయిన గోపాల్‌రావు, మాచర్ల నాగభూషణం, మేకల మల్లిఖార్జున్, ఏఐవైఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని చింతకాని గ్రామానికి చెందిన తూము శ్రీనివాసరావు కు రూ. 46,500, గుత్తికొండ నిర్మల కి రూ. 10,500, వెంపటి లక్ష్మీకి రూ.60,000 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మదుపల్లి భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్‌కమిటీ డైరక్టర్ షేక్ ఖాసీం, చెన్నకేశవ స్వామి దేవాలయ చైర్మన్ యండపల్లి శ్రీనివాసరావు,గ్రామ శాఖ అధ్యక్షుడు మజాద్, నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బీఎల్‌ఏ సూపర్‌వైజర్లకు ఎస్‌ఐఆర్‌పై అవగాహన

**-ఓటరు సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏ(బూత్ లెవల్ ఏజెంట్)సూపర్‌వైజర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలు, ఏదులాపురం మున్సిపాలిటీలకు చెందిన బీఎల్‌ఏ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగ సీతారాములు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించగా, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తదితర నాయకులు సూపర్‌వైజర్లకు సూచనలు చేశారు.

# 17న జరిగే ఆటోవర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయండి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరంలో ఎంబీ,ఫంక్షన్‌హాల్ నందు ఈ నెల17న జరిగే తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా ఎనిమిదవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో విజయవంతానికై ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎండీ జాక్రుద్ధీన్‌తో అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, భవిష్యత్తులో చేయవలసిన కర్తవ్యాలపై చర్చిండానికే ఈ మహాసభలను నిర్వహించడం జరగుతుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగా ఈ మహాసభలలో కార్మికుల సమస్యల, హక్కులపై చర్చలు జరుగుతాయ అన్నారు. 2023 తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మహాల క్ష్మి పథకం కారణంగా ఆటో కార్మికులు తీవ్ర నష్టపోయారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తానన్నహామీలోనే ఆటో కార్మికులను ఆదుకోవడానికి సంవత్సరానికి 12వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిందని ఆయన గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకం అమలై రెండున్నర సంవ్సరాలు అవుతున్న ఇంతవరకు ఆటో కార్మికుల వైపు చూడకపోవడం శోచనీయమన్నారు. ఈ మహాసభలకు ఖమ్మం జిల్లా నలుమూల నుండి ఆటో కార్మికులు హాజరువుతున్నారని ఖమ్మం నగరంలోని ప్రతి ఒక్కఆటో కార్మికుడు ఈ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు అడ్డా ఏర్పాటు చేయడం,ట్రాఫిక్ పోలీసులు వేధింపులను అరికట్టడం, ఫిట్నెస్, పెనాల్టీల భారం తగ్గించడానికి, ఉచిత రవాణా నష్టపరిహారం చెల్లించడానికి కావలసిన పోరాటాలను రావాల్సిన హక్కులను ఈ మహాసభలలో చర్చించుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీను, జిల్లా సమితి సభ్యులు మేళ్లచెర్వు గురవయ్య, బద్దల మల్లయ్య, బద్దల బోరయ్య, కొత్త నాగరాజు, కొండా మహేష్, వేర్పుల మురళి, ఘనపరపు వీరబాబు పాల్గొన్నారు.

# తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్ విజయోత్సవాలు




**ప్రజాపక్షం/ఇల్లందు:** తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్‌కు కేంద్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ మంజూరు చేయడంతో ఇల్లందు ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోయగూడెం ఓసీపీ, జేకే 5 ఓసీపీ తదితర ప్రాంతాల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఇల్లందు ఏరియా జీఎం వి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్ సంస్థ భవిష్యత్ అభివృద్ధికి కీలకమన్నారు. ఈ గనిలో 434 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, సుమారు 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి కెఎల్ఆర్ కృషి మరువలేనిది



**- ఘనంగా కేఎల్ఆర్ వర్ధంతి వేడుకలు**
**- నేటి యువత కేఎల్ఆర్ అడుగుజాడల్లో నడవాలి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి కే. లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా అన్నారు. కేఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు కాటిరెడ్డి లక్ష్మారెడ్డి 15వ, వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి స్థానిక కేఎల్ఆర్ ఘాట్ లక్ష్మారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మొదటి నుండి పోరాట పటిమ కలిగిన వ్యక్తిగా, విద్యార్థి నాయకుడిగా, పేద విద్యార్థుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్థలను స్థాపించి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందజేసిన లక్ష్మారెడ్డి సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. పేద వర్గాల కష్టాలు తెలిసిన మహోన్నత వ్యక్తి లక్ష్మారెడ్డి ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందించారని చెప్పారు. అలాంటి కేఎల్ఆర్ అడుగుజాడల్లో నేటి యువతరం సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అయనతో ఉన్న అనుబందాన్నిగుర్తుకు చేసుకొన్నారు.

# రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం



**- సమస్యను సిఎం దృష్టికి తీసుకెళతాం**
**- ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు**
**- అన్యాయంపై సబ్ కమిటీ సమావేశంలో చర్చిస్తాం**
**- మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రోస్టర విధానం కారణంగా మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, బొగ్గు గనుల శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం భద్రాచలం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావుతో కలిసి శ్రీ సీతా రామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం చర్లరోడ్‌లోని గిరిజన భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నిర్వహించిన మాలల మహార్యాలీ, బహిరంగ సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రోస్టర్‌లో జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు చెప్పారు. సిఎం ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జరిగే క్యాబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై చర్చిస్తామన్నారు. గ్రూప్ 3 నియామకాల్లో మాలలకు 5 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ రోస్టర విధానం ప్రకారం కేవలం 2.8 శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం విడుదల చేసిన 100 ఉద్యోగాల్లో మాలలకు రావాల్సిన ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈవిషయంపై సామాజిక సంక్షేమశాఖ మంత్రి అట్లూరి లక్ష్మణరావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కూడా చర్చించామని తెలిపారు. అనంతరం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుడగం శ్రీనివాస్, రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, చింతిర్యాల రవికుమార్, రాజీవ్, రాము, వెంకటరెడ్డి, తిరుపతిరావు, సుధాకర్, దుర్గారావు, రామకృష్ణ, బషీర్, శ్రీను విజయ్, భాను, రాజేష్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేసిన మేయర్



**ప్రజాపక్షం/సుజాతనగర్:** మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు స్థానిక సీపీఐ సుజాతనగర్ మండల పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకత్వానికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మేయర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మూడ్ గణేష్ ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, ఓటు హక్కు ప్రదాత, సమానత్వ సమాజ నిర్మాణ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను ప్రజలందరి కార్యక్రమంగా భావించి, సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనికి స్పందించిన సీపీఐ నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రజలందరికీ రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు, రక్షణ కల్పించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తమను ఆహ్వానించడం ఆనందదాయకమని, పార్టీ తరపున తప్పకుండా హాజరై కార్యక్రమం విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సుజాతనగర్ మండల కార్యదర్శి జిల్లా కౌన్సిల్ సభ్యులు కోమారి వీర హనుమంతరావు, సీపీఐ సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సీపీఐ మండల మాజీ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దసురు, సీపీఐ సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు తాళ్ల వెంకటేశ్వర రావు, ప్రముఖ అంబేద్కర్ వాది వేల్పుల భాస్కర్, కత్తి వెంకన్న, విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు గుండేటి వెంకట రాములు, మరిపిటి రాములు, మరిపిటి మాధవరావు, మురిపిటి నాగేష్, గుండేటి గోపయ్య, గార్ల రాజు, మంద చంటి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు ఎన్ఎస్పి సర్కిల్ పరిధిలోని సత్తుపల్లి, కల్లూరు, మధిర డివిజన్ పరిధిలోని 50 వేల ఎకరాలు సత్తుపల్లి డివిజన్ పరిధిలోని 6000 ఎకరాలు లో గోదావరి జలాలు రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన నిరుత్సాహంలో ఉన్న రైతులకు సాగర్ జలాలు ఈ ప్రాంతానికి రావడం వలన రైతులు ఎంతో ఆనందంలో ఉన్నారు. దీని వలన ఇప్పటికే చెరువులు కుంటలు ఈ జలాలతో నింపుకుంటున్నారు. కల్లూరు ఎన్ఎస్పి సర్కిల్ పరిధిలోని పది మండలాలకు ఈ నీరు ఎంతో ఉపయోగకారిగా ఉంటూ ఖరీఫ్ సీజన్ కు కష్టాలు లేకుండా ఈ నీరు అందుతాయని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. దీని వలన ఖరీఫ్ సీజన్ వడ్డెక్కుతామని రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి. సీతారామ ప్రాజెక్టు ఎగువ బాగాన వర్షాలు కురిస్తే గోదావరి జలాలు సాగర్ కు వస్తాయని వారి పేర్కొంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వరి సాగుకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఎల్ నిన్ నో ప్రభావం వలన వర్షాలు రావని ఒక ఆలోచనతో రైతులు ఉండగా ఈ సమయంలో సాగర్ జలాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలతో నీరు రావడంతో రైతులు ఆనందంలో ఉత్సాహంగా ఉల్లాసంగా వ్యవసాయాలను ప్రారంభించారు. ఏమైనప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్ ఈ జలాలు రావడం వలన సంతోషంలో రైతులు ఉన్నారు.

# నేడు మణుగూరులో పర్యటించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/మణుగూరుః** భారత ప్రభుత్వ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సోమవారం ఉదయం మణుగూరు పీకే ఓసీ2 ప్రాజెక్టులో జరిగే గేట్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. 1985లో మణుగూరు జూనియర్ కాలేజీ విద్యార్థి సంఘం ఎన్నికల సమయంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి మణుగూరుకు వచ్చారు. ఇప్పుడు కేంద్ర మంత్రిగా రెండోసారి మణుగూరుకు వస్తున్నారు. ఈ సందర్భంగా పీకే ఓసీ2 డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించి మణుగూరు భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# అరుణోదయ నాగన్న ఆశయాలను కొనసాగిస్తాం



**ప్రజాపక్షం/కూసుమంచి:** విప్లవ గాయకుడు అరుణోదయ నాగన్న ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ వెంకన్న అన్నారు. ఆదివారం కూసుమంచిలో పార్టీ సీనియర్ నాయకుడు మాతంగి రామస్వామి అధ్యక్షతన జరిగిన నాగన్న సంతాప సభలో ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రజలను చైతన్యపరిచిన మహానాయకుడు నాగన్న అని కొనియాడారు. కళ ప్రజల కోసం అనే సిద్ధాంతంతో పేద ప్రజల పక్షాన తన గళాన్ని వినిపించిన ఆదర్శ కమ్యూనిస్టుగా నాగన్న నిలిచారని అన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈనెల13న ఉదయం 10గంటలకు నాగన్న స్వగ్రామం తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో జరిగే జిల్లా స్థాయి సంతాప సభకు గాయకులు, రచయితలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, నాగన్న అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు, గోపి రవి, కాంపాటి మధు, కనకం గోపయ్య, బుల్లికొండ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భరోసా యాత్రను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సింగరేణి భరోసా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల భవిష్యత్ కోసం వారి భద్రత కోసం భరోసా కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సోమవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్రావు లు చేపట్టిన భరోసా యాత్ర కు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ఉదయం 7 గంటలకు నాయకన గూడెం టోల్ గేట్ వద్ద వారి కి స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున రావా సూచించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ, భద్రత పారదర్శక పరిపాలన, బొగ్గు పరిశ్రమ అభివృద్ధి తెలంగాణ ప్రజలు ఆకాంక్ష అన్నారు. కార్మికుల కు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. సింగరేణి బలోపేతం కోసం సాగే ఈ యాత్రలో ప్రతీ ఒక్కరూ కదలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయుకులు సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పుట్టా సత్యనారాయణ, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని మంగాపురంతండా లో ఆదివారం ముత్యాలమ్మ పండగ ను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున ప్రభలు కట్టారు. మేళతాళాలతో ప్రదర్శన నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేశారు. ఆటా, పాటలతో సందడి చేశారు. ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, కుటుంబ సభ్యుల రాకతండాలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, చెరువుమాధారం మృత్సపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై పారా లీగల్ వాలంటీర్ సర్వే



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సమస్యల పై పారా లీగల్ వాలంటీర్స్ సర్వే చేపట్టారు. మండలం లోని తిరుమలాపురం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వాలంటీర్స్ ఇంటింటా సర్వే చేపట్టారు. పెన్షన్స్, రేషన్ కార్డులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులు అందుతున్నాయా లేదా అని క్షేత్ర స్థాయిలో బృందం వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామంలో మహిళ సంఘం భవనం, బస్టాండ్ ఇతరత్రా సమస్యల పై స్థానికులు టీమ్కు దరఖాస్తులు అందించారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలపై స్థానిక సర్పంచ్ కమదన ప్రవీణ్ ను కలిసి వివరించారు. కనీస మౌళిక వసతులు గురించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా టీమ్ ప్రతినిధి కొలిపాక నాగమణి మాట్లాడారు. ప్రజలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు గ్రామంలో క్షేత స్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ ప్రవీణ్ సహకారం అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ యం.నాగమణి, పి.సుశీల, నాగేంద్ర, పద్మావతి, కె.నాగేంద్ర, ఉదయ్, నాగలక్ష్మి, రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

# మాటిస్తే మడమ తిప్పని కూనంనేని

- పాల్వంచలో వేగంగా సాగుతున్న రోడ్డు, డ్రైన్లు
- రూ. 38 లక్షల డిఎంఎఫ్‌టి నిధులతో పనులు
- పాల్వంచ అభివృద్ధిపై కూనంనేని మార్క్
- హర్షం వ్యక్తం చేస్తున్న పాల్వంచ వాసులు





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ పట్టణ ప్రజల దశాబ్దాల నాటి కష్టాలను ఇబ్బందులను స్వయంగా గుర్తించిన కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పాల్వంచలోని పోలీస్ పెట్రోల్ బంక్ నుండి మణికంఠ బుక్ షాపు వరకు సుమారు 300 మీటర్ల వరకు అధ్వాన్నంగా మారిన రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనుల కోసం రూ. 38 లక్షల భారీ డిఎంఎఫ్‌టి నిధులను ఆయన ప్రత్యేకంగా మంజూరు చేశారు. నిధుల మంజూరు ప్రక్రియ నుండి పనుల రూపకల్పన వరకు ప్రతి దశలోనూ ఎంఎల్‌ఏ స్వయంగా పర్యవేక్షించి ప్రజల ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ముందడుగు వేశారు. సాంకేతిక కారణాల వల్ల పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగినప్పటికీ అధికారులతో నిరంతరం సమీక్షలు జరిపి పనులను పట్టాలెక్కించారు. ఎంఎల్‌ఏ కూనంనేని చిత్తశుద్ధితో పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులను అతిత్వరలో పూర్తి చేయించి అందుబాటులోనికి తేనున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూనంనేని చేస్తున్న కృషి, పట్టుదలతో సాధిస్తున్న అభివృద్ధి ఇక్కడ జరుగుతున్న పనులే నిదర్శనం. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజల కష్టాలను శాశ్వతంగా తీర్చిడమే ధేయ్యంగా సాగుతున్న పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలి
- మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి





**ప్రజాపక్షం/చుంచుపల్లి:** భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సామాజిక న్యాయం, సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం చుంచుపల్లి మండలం నందా తండా గ్రామపంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నూతన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకు ముందు అంబేద్కర్ విగ్రహానికి ఆయ న పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ, డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, జై భీమ్ నినాదాలతో హౌసింగ్ బోర్డు సెంటర్ సందడిగా మారింది. కాలనీతోపాటు పరసర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, సామాజిక సంఘాల ప్రతినిధులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని రూపొందించి భారత ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పించారని కొనియాడారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక ప్రజల సహకారం, దాతల ఉదార విరాళాలు, యువత అంకితభావంతో ఈ విగ్రహాన్ని నిర్మించినట్లు తెలిపారు. భావితరాలకు అంబేద్కర్ ఆశయాలను చేరవేయడం, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించడమే విగ్రహ ప్రతిష్టపన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమాని విజయవంతం చేసిన ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు తంపూరి శివ, కార్యదర్శి తాంధ్ర వెంకటేశ్వర్లు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, గొనె శ్రీకాంత్, గుర్రం లక్ష్మ ణ్, గడ్డం రగన్ బాబు, శనగ స్వామి, జిల్లా టీం కన్వీనర్ దాసరి రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, విద్యానగర్ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతోటి పాల్, నందా తండా సర్పంచ్ మాలోత్ బలరాం, చుంచుపల్లి సర్పంచ్ వీరన్న, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువజన, మహిళా సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ నుంచి తెచ్చి.. చెరువుమాధారంలో కోస్తుండుగా...

- ఏడు అడవి పందులను పట్టుకున్న పోలీసులు
- వన్యప్రాణి చట్టం ప్రకారం కేసు నమోదు





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అక్రమంగా అడవి పందులను తీసుకొచ్చి, మాంసం విక్రయించేందుకు సిద్ధం కాగా...సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని అదుపులోకి తీసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ నుంచి నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం కు అదివారం తెల్లవారు జామున డీసీఎం వ్యాన్ లో 7 అడవి పందులను తీసుకొచ్చారు. సూర్యాపేట జిల్లా లోని చిలుకూరు కు చెందిన పి.నాగరాజు అనే వ్యక్తి డీసీయం లో తీసుకొచ్చారు. వాటిని కోసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే రెండు పందులను చంపి కోయటానికి చర్యలు చేపట్టగా స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. నేలకొండపల్లి ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలంకు చేరుకుని వాటిని అక్రమంగా తీసుకొచ్చిన నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ కె.వీ.రామారావు, సెక్షన్ ఆఫీసర్ పి.దానియేలు లు ఘటనా స్థలం"కు చేరుకుని వాటిని పరిశీలించారు. నాగరాజు తో పాటు, చనిపోయిన రెండు పందులను, బ్రతికిన మరో ఐదు అడవి పందులను మరియు డీసీఎం వ్యాన్ ను అటవీ శాఖకు స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వాటిని పశు సంవర్ధక శాఖ అధికారుల వద్ద పోస్టుమార్టమ్ ను నిర్వహించి కబేళారాలను దహానం చేశారు. బ్రతికిన ఐదు అడవి పందులను వెలుగుమట్ల ఫారెస్ట్ లో వదిలారు. అడవి పందులను తరలించిన నాగరాజు పై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపారు.

## నిధి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ శిక్షణా సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని టిటిడిసి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన నిధి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆదివారం ఛైర్మన్ అండ్ ఫౌండర్ రామోజీ ఉప్పలచారి కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన తమ సంస్థ నూతనంగా టిటిడి ఎదురుగా నూతనంగా సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నాలెడ్జ్, ఆధునీక సాంకేతిక నైపుణ్యాలను అందిస్తూ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా కృషి చేస్తామన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మెరుగైన శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల నిర్వాహకులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పెనుబల్లికి చేరిన గోదావరి జలాలు

### రైతుల్లో ఆనందోత్సవాలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎల్నీనో ప్రభావంతో వర్షాభారం తక్కువై ఈ ఖరీఫ్ సీజన్ కి వర్షాలు పడతాయా లేదా అనే అనుమానాలతో రైతులు దిగాలు పడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరాకు మళ్లించి అక్కడి నుండి నాగార్జున కాలవకు గోదారి జలాలను మళ్ళించారు. దాంతో ఆదివారం పెనుబల్లి మండల పరిధిలో కొనసాగుతున్న నాగార్జునసాగర్ కాలువలోకి గోదారి జలాలు ప్రవహిస్తుంటుందో రైతుల్లో ఆనందాలు వెలువత్తాయి. నాగార్జునసాగర్ కాలువ ద్వారా పెనుబల్లి మండలంలోని చాలా చెరువుల్లోకి సాగరకాలం నుండి గోదారి జనాలను మళ్లించి చెరువులు నింపుకునే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగర కాలవ పరిధిలోని వి ఎం బంజర్ సీతారాంపురం తుమ్మలపల్లి, కుప్పెనకుంట్ల, కొత్త కారాయిగూడెం గ్రామాల్లో కొన్నిచోట్ల వరి నాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు చెరువులో ఉన్న నీటిని ఉపయోగించుకొని రైతులు నాట్లు వేస్తున్నారు. ఇప్పుడు నాగార్జునసాగర్ కాలువ ద్వారా గోదారి జలాలను విడుదల చేయటంతో చెరువులను నింపుకొని వర్షాలు అనుకూలించిన అనుకూలించకపోయినా కొంతవరకు అట్టి నీటి వనరులతో ఖరీఫ్ సీజన్ పండుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇటు జలాలను మండలంలోని మేజర్ ప్రాజెక్టు అయినా లంకాసాగర్ ప్రాజెక్టుకు సైతం నీటిని నింపేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

## నెల రోజులైనా దొరకని సర్వేశ్ ఆచూకీ..

-మిస్టరీగా తీగలంచ వాసి అదృశ్యం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం తీగలంచకు చెందిన ఈసం సర్వేశ్(27)నెల రోజులుగా అదృశ్యమయ్యాడు. ఇల్లందులోని సత్యనారాయణపురంలో ఉంటూ కూలీ పని చేస్తున్న సర్వేశ్ జూన్ 14న పని కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ ఫిర్యాదుతో ఇల్లందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నెల గడిచినా ఆచూకీ లభించకపోవడంతో భార్య మంజుల, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సర్వేశ్‌ను త్వరగా గుర్తించాలని కోరుతున్నారు. సమాచారం తెలిసిన వారు 9849648730కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదం జరిగింది. ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం లోని ఓ సెల్ఫోన్ టవర్ మరమ్మతుల కోసం కల్లూరు కు చెందిన కొంత మంది వచ్చి పనులు చేస్తున్నారు. ఆదివారం పనిలో భాగంగా ఈశ్వర్ అనే కార్మికుడు 11 కెవీ లైన్ కు జంపర్లు కలిపేందుకు ఎల్సీ కోసం ఆన్లైన్ లో కోరారు. కానీ అనుమతులు రాకముందే జంపర్లను కలిపేందుకు ట్రాన్స్ ఫార్మర్ వద్ద పని చేస్తుండుగా, ప్రమాదవశాత్తు షాక్ కొట్టింది. అక్కడ నుంచి తొపుడు బండి పై పడటంతో తీవ్ర గాయాలైయ్యాయి. వెంటనే సహచరులు ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఖమ్మం లోని ఓ ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.

## వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల



**ప్రజాపక్షం/ఏన్కూరు:** తిమ్మారావుపేట సమీపంలోని నాగార్జునసాగర్ ప్రధాన కాలువ ఎస్కేప్ లాకుల ద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను ఎంఎల్‌ఏ మాలోతు రాందాస్ నాయక్ ఆదివారం విడుదల చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మ తల్లికి హారతి ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఖమ్మం సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్క్‌ఫెడ్ వైస్ ఛైర్మన్ బొర్ర రాజశేఖర్, వైరా మున్సిపల్ వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్, ఏఎంసీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరామ్‌నాయక్, సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.